ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
చిత్తూరు
జిల్లా వార్తలు
బుధవారం 30 అక్టోబరు 2024

ప్రాథమిక విద్యకు మళ్లీ ప్రాణం

● 'విలీనం రద్దు'తో తెరచుకోనున్న 814 పాఠశాలలు ● సీఎం నిర్ణయంతో మూతబడిన బడులకు జీవం
● ఉపాధ్యాయ సంఘాలు, తల్లిదండ్రుల హర్షం



ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న టీచర్

గత ప్రభుత్వ తప్పిదంతో గాడి తప్పిన ప్రాథమిక విద్యా వ్యవస్థను గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేసింది. వైసీపీ సర్కారు అమల్లోకి తెచ్చిన 117 జీవోను ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రద్దు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. దీన్ని ఇటు ఉపాధ్యాయ సంఘాలు, అటు విద్యార్థుల తల్లిదండ్రులు స్వాగతిస్తున్నారు. జీవో పూర్తి స్థాయిలో రద్దయితే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక విద్యకు ప్రాణం పోసినట్లే. వీటితోపాటు ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య గణనీయంగా తగ్గడమే కాకుండా, మరింతమంది ఉపాధ్యాయుల ఖాళీల భర్తీతో ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం కానుంది.

- చిత్తూరు సెంట్రల్, ఆంధ్రజ్యోతి

తెరచుకోనున్న ప్రాథమిక పాఠశాలలు

వైసీపీ ప్రభుత్వం తెచ్చిన 117 జీవోతో విద్యావ్యవస్థ నిర్వీర్యమైంది. మూడో తరగతి నుంచే సబ్జెక్టు టీచర్లతో బోధన చేయిస్తామని.. 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసింది. ఈ నిర్ణయంతో విద్యా వ్యవస్థ ఒక్కసారిగా గాడి తప్పింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం (ఎన్‌పీఎస్)లో భాగంగా 2020-21లో మొదలైన ప్రాథమిక బడుల విలీనం రెండేళ్ల పాటు సాగింది.

జిల్లాలో విలీనం ఇలా..

తొలి దశలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 250 మీటర్ల దూరంలోని 316 ప్రాథమిక పాఠశాలలను 312 ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. రెండో దశలో మూడు కిలో మీటర్ల దూరాన్ని నిర్దేశించారు. దీనిపై తల్లిదండ్రుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అయినా ప్రక్రియ ముందుకు సాగింది. రెండో దశలో 498 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను 347 ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. 2021లో విలీన నిర్ణయం తీసుకున్నారు.. 2022లో చేపట్టారు.. 2023 విద్యా సంవత్సరం చివరి వరకు ఈ ప్రక్రియ సాగింది. తొలుత ఉపాధ్యాయుల పదోన్నతులు, ఆపై సర్దుబాటుకు దారితీసింది.ప్రస్తుత పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం 117 జీవో రద్దు చేస్తే తొలి, మలి దశల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూతబడిన 814 ప్రాథమిక పాఠశాలలు తెరచుకోనున్నాయి.గ్రామీణ పిల్లలకు విద్య అందడంతోపాటు.. ఉపాధ్యాయ ఖాళీలు ఏర్పడుతాయి. భర్తీ చేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ మరోసారి ఇచ్చే అవకాశముంది.

2వేల ఏకోపాధ్యాయ పాఠశాలలు తగ్గుతాయి

పాఠశాలల విలీనంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విద్య దూరం కావడంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. విలీనం కాగా మిగిలిన పాఠశాలల్లో నిబంధనల ప్రకారం 20 మంది పిల్లలకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో ఎక్కువ మంది ఉన్న చోటుకు టీచర్లను బదిలీ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 4,900 పాఠశాలలు ఉండగా, 30 మంది కంటే తక్కువ విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలు రెండువేలకుపైగా ఉన్నాయి. వీటిల్లో చాలా చోట్ల ఇద్దరేసి టీచర్లు ఉండగా, పాఠశాలల విలీనంతో అవన్నీ ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయి. కూటమి ప్రభుత్వం 117 జీవో రద్దు చేస్తే ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య వేలల్లో నుంచి కేవలం పదుల సంఖ్యలోకి రానున్నాయి.

ఇక గ్రామీణ విద్య పటిష్ఠం



విద్యా రంగాన్ని అన్నివిధాలా నిర్వీర్యం చేసిన 117 జీవోను రద్దు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం అభినందనీయం. క్షేత్ర స్థాయిలో ప్రాథమిక విద్యతోనే ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలంగా మారుతుంది. ఇక గ్రామీణ విద్యార్థులకు విద్యను దగ్గరగా అందించినట్లే.

- బాలాజి, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు

ఉద్యమ ఫలితంగానే జీవో రద్దు

విద్యాశాఖకు గొడ్డలి పెట్టుగా మారిన 117 జీవో రద్దు కోసం ఉపాధ్యాయ సంఘాలు చేసిన ఉద్యమానికి కూటమి ప్రభుత్వం విలువనిచ్చింది. జీవోను రద్దు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేయడం శుభపరిణామం.



- జీవీ రమణ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

తగ్గనున్న ఏకోపాధ్యాయ పాఠశాలలు



కూటమి ప్రభుత్వం 117 జీవో రద్దు చేస్తే ఏకోపాధ్యాయ పాఠశాలలు తగ్గనున్నాయి. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంతోపాటు మరిన్ని ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయడం ద్వారా క్షేత్ర స్థాయిలో ప్రాథమిక విద్య బలోపేతం కానుంది.

- సమీర్, ఏపీటీఎఫ్ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి

ఎన్నికల తరువాత పెరిగిన ఓటర్లు 3 వేలమంది

● జనవరి 6న తుది ఓటర్ల జాబితా విడుదల



ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తున్న పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసినట్లు డీఆర్వో పుల్లయ్య తెలిపారు. మంగళవారం ఎన్ఐసీ వీడియో సెంటర్‌లో జాబితా విడుదల చేశారు. అనంతరం మీడియాతో, రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడారు. మంగళవారం నుంచి నవంబరు 28వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు ఎన్నికల సంఘం గడువు ప్రకటించిందని చెప్పారు. నవంబరు 9, 10, 23, 24 తేదీల్లో ఓటర్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణకు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు. జాబితాలో పేరు లేకుంటే నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2025 జనవరి 6న తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తామని వెల్లడించారు. మార్చిలో జరిగిన ఎన్నికల తర్వాత నుంచి ఇప్పటి వరకు మూడువేల మంది ఓటర్లు పెరిగారన్నారు. ఓటర్ల సౌలభ్యం కోసం అదనంగా 14 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపించినట్లు వివరించారు. తాజాగా పురుష ఓటర్లు 7,71,264, మహిళా ఓటర్లు 7,95,165 మంది, థర్డ్ జెండర్ 73 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సురేంద్రకుమార్, అట్లూరి శ్రీనివాసులు, గంగరాజు, పరదేశి, బాలసుబ్రహ్మణ్యం, భాస్కర్, ఎన్నికల విభాగ తహసీల్దార్ వాసుదేవన్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీహరిపై కొనసాగిన విచారణ

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా గత డీఎంహెచ్‌వో, ప్రస్తుత తిరుపతి డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరిపై రెండో రోజైన మంగళవారం కూడా విచారణ కొనసాగింది. విచారణాధికారిగా వచ్చిన గుంటూరు డీఎంహెచ్‌వో విజయలక్ష్మి అప్పట్లో డీఎంఅండ్‌హెచ్ కార్యాలయంలో పనిచేసిన పలువురిని పిలిపించి, వివరాలను రికార్డు చేశారు. వీరితోపాటు జిల్లాలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులను సైతం పిలిపించి విచారణ చేపట్టారు. అదే సమయంలో హాజరు కాని వారిపైనా రిపోర్టును సిద్ధం చేయనున్నట్లు సమాచారం. ఈ నివేదికలను డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారులకు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు.

రోడ్డు పక్కనే టపాకాయల దుకాణాలు

● సమీపంలోనే నివాస సముదాయాలు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా టపాసుల విక్రయాలు, తయారీ జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేస్తున్న అధికారులే నిబంధనలకు తిలోదకాలిచ్చారు. నివాస సముదాయాల పక్కన, బైపాస్ రోడ్డుకు ఆనుకుని దుకాణాలను ఏర్పాటు చేయడంపై విమర్శలొస్తున్నాయి. చిత్తూరు నగరవాసుల కోసం గతంలో మార్కెట్ యార్డు మైదానంలో దుకాణాలను ఏర్పాటు చేసేవారు. విశాలంగా ఉండటంతోపాటు వర్షాలు వస్తే కూడా పర్మినెంటు షెడ్డులు ఉండటంతో వ్యాపారులకు, కొనుగోలుదారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావు.ఈసారేమో తొలుత పీవీకేఎన్ డిగ్రీ కళాశాల మైదానం అని చెప్పి.. తర్వాత మార్కెట్‌యార్డు అని ప్రకటించారు. చివరికి మురకంబట్టు బైపాస్ రోడ్డులో దుకాణాల ఏర్పాటుకు అధికారులు అనుమతి ఇచ్చారు. ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగించడంతోపాటు రోడ్డును ఆనుకుని దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. దుకాణాలు ఏర్పాటు చేస్తున్న ప్రాంతానికి సమీపంలోనే నివాస ప్రాంతాలూ ఉన్నాయి. మరోవైపు దుకాణదారులే తాత్కాలిక షామియానాలతో టెంట్‌లను వేసుకుంటున్నారు. బలమైన వర్షాలు వస్తే టపాసులంతా తడిచిపోతాయి.టపాసుల కొనుగోలుకు పెద్ద సంఖ్యలో జనం వస్తే వాహనాలన్నీ బైపాస్ రోడ్డులోనే పార్కింగ్ చేయాల్సి వస్తుంది. అలా జరిగితే ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగే అవకాశం ఉంది.కొనుగోలు దారులు కూడా చిత్తూరు నగరం నుంచి ఐదు కిలోమీటర్ల దూరం వెళ్లి తీసుకోవడానికి ఇబ్బందులు పడే అవకాశం ఉంది.పోలీసులు, అగ్నిమాపక, ఇతర శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే సమస్యలు తలెత్తవన్న జనం అంటున్నారు.

నిబంధనలను అతిక్రమించి టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు: ఎస్పీ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనుమతులు లేని గోడౌన్లు, నిల్వ కేంద్రాలు, టపాసుల తయారీ ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మణికంఠ పేర్కొన్నారు. ఎవరైనా అక్రమంగా టపాసులను నిల్వ ఉంచినా, తయారు చేసినా వెంటనే డయల్ 112 లేదా చిత్తూరు కమాండ్ కంట్రోల్ రూమ్ 94409 00005కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. నిబంధనలను పాటించి.. జిల్లా ప్రజలందరూ దీపావళి పండగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.



బైపాస్ రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన టపాకాయల దుకాణాలు

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి: డీఆర్వో



కలెక్టర్‌ను కలిసిన మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి సహకారంతో కృషిచేస్తానని నూతన డీఆర్వో కె.మోహన్‌కుమార్ అన్నారు. విశాఖపట్నంలో డీఆర్వోగా పనిచేస్తున్న ఆయన్ను జిల్లాకు ఇటీవల బదిలీచేసిన విషయం తెలిసిందే. మంగళవారం డీఆర్వో చాంబర్‌లో ప్రస్తుత డీఆర్వో పుల్లయ్య నుంచి బాధ్యతలు స్వీకరించారు. తొలుత కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బాధ్యతలు స్వీకరించాక కాణిపాక దేవస్థాన వేదపండితులు ఆశీర్వాదం చేసి.. తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం నూతన డీఆర్వోను పలమనేరు ఆర్డీవో భవాని శంకరి, కలెక్టరేట్ ఏవో కులశేఖర్, రెవెన్యూ శాఖకు చెందిన వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, అధికారులు కలిసి, అభినందించారు. కాగా, ప్రస్తుతం డీఆర్వోగా ఉన్న పుల్లయ్యను ప్రభుత్వం కడప జిల్లా తెలుగుగంగ ప్రాజెక్టు భూసేకరణ విభాగ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది.

కరువు మండలాలు 16

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో పడమర-దక్షిణ రుతుపవనాలు అనుకూలించకపోవడంతో జిల్లాలో కరువు ఛాయలు నెలకొన్నాయని ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు జిల్లాల్లో 54 మండలాలను కరువు ప్రాంతాలుగా మంగళవారం ప్రకటించింది. మన జిల్లాకు సంబంధించి 16 (పెనుమూరు, యాదమరి, గుడిపాల, శ్రీరంగరాజపురం, చిత్తూరు, శాంతిపురం, రొంపిచెర్ల, పూతలపట్టు, సోమల, పుంగనూరు, పలమనేరు, బైరెడ్డిపల్లె, వి.కోట, గుడుపల్లె, కుప్పం, రామకుప్పం) మండలాలు ఉన్నాయి.

ముక్కంటి ఆలయ ఈవోగా బాపిరెడ్డి



శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా టి.బాపిరెడ్డిని నియమిస్తూ దేవదాయ శాఖ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి ఆర్‌జేసీగా ఉన్న చంద్రశేఖర్ ఆజాద్ ముక్కంటి ఆలయ ఇన్‌చార్జి ఈవోగా వ్యవహరించారు. ఈ క్రమంలో రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న బాపిరెడ్డిని ముక్కంటి ఆలయ ఈవోగా బదిలీ చేస్తూ ఆదేశాల్లో పేర్కొన్నారు.

సివిల్ సర్వీసెస్ క్రీడాకారుల జిల్లా జట్ల ఎంపిక

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడాకారుల జిల్లా జట్ల ఎంపిక ప్రక్రియ మంగళవారం స్థానిక జిల్లా క్రీడాప్రాధికార సంస్థ క్రీడా మైదానంలో నిర్వహించారు. డిస్ట్రిక్ స్పోర్ట్ డెవలప్‌మెంట్ అధికారి బాలాజి మాట్లాడుతూ 90 మంది క్రీడాకారులు క్రికెట్, చెస్, షటిల్ బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్‌తోపాటు అథెటిక్స్‌లోని 800, 200, 100 మీటర్ల రన్నింగ్ రేస్ నిర్వహించామన్నారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు.

తిరుపతిలో బాలికా సంప్రదాయ పాఠశాల ఏర్పాటు

●టీటీడీ భూ కేటాయింపునకు ప్రభుత్వ ఆమోదం

తిరుమల, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): బాలికల కోసం ప్రత్యేకంగా తిరుపతిలో ఏర్పాటు చేయనున్న సంప్రదాయ పాఠశాలకు టీటీడీ భూమి లీజుకు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. కంచికామకోటి పీఠం ఆధ్వర్యంలో ఈ సంప్రదాయ పాఠశాల ఏర్పాటు కానుంది. ఇందుకోసం అలిపిరి జూపార్క్ రోడ్డులో టీటీడీకి చెందిన ఐదెకరాలను కంచి పీఠం కోరింది. గతేడాది నవంబరులో జరిగిన టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో ఎకరాకు ఏడాదికి రూ.వెయ్యి చొప్పున 33 ఏళ్ల పాటు లీజు ప్రాతిపదికన కేటాయిస్తూ తీర్మానించింది. అనంతరం ఆమోదం కోసం ప్రభుత్వానికి టీటీడీ లేఖ పంపింది. ఈ క్రమంలో తీర్మానాన్ని ఆమోదిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కార్యదర్శి సత్యనారాయణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సంప్రదాయ పాఠశాలలో లలిత సహస్రనామాలు, మంత్రాలు, అష్టోత్తర శతనామావళి, విష్ణుసహస్రనామాలు వంటి వాటిపై తరగతులు నిర్వహించనున్నారు.

కన్వెన్షన్ సెంటర్లు, హోటళ్ళు, రిసార్టులకు భూములిస్తాం

● జాతీయ విద్యాసంస్థల్లో డ్రగ్స్‌పై చైతన్య పరిచే కార్యక్రమాలు ● మంత్రి అనగాని సత్యప్రసాద్



మంత్రి సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు

తిరుపతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):. రోజూ లక్షమందికి పైగా యాత్రికులు రాకపోకలు సాగించే తిరుపతిని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాల్సి వుందని రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం సాయంత్రం తిరుపతి కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.జిల్లాను అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలపడానికి ఏ ప్రణాళికలతో ముందుకు వెళ్ళాలనే అంశంపై ఇన్‌చార్జి మంత్రిగా అధికారులతో సమీక్షించామన్నారు. ఆతిథ్య రంగ అభివృద్ధిలో భాగంగా కన్వెన్షన్ సెంటర్లు, హోటళ్ళు, రిసార్టుల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి అవసరమైన భూములు కేటాయిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో తిరుపతి జిల్లాలో జరిగిన భూకబ్జాలపై అధ్యయనం చేస్తున్నామన్నారు. జిల్లాలో నిషేధిత జాబితా నుంచీ ఎక్కువగా భూములు తొలగించి ఫ్రీహోల్డులో వుంచారని, వాటిలో చాలావరకూ రిజిస్ట్రేషన్లు కూడా జరిగాయని గుర్తించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత జాబితా నుంచీ భూములను తొలగించిన చోట్ల, రిజిస్ట్రేషన్లు జరిగిన చోట్ల క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలిస్తున్నారన్నారు. దీనికోసం ప్రత్యేకంగా డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులను నియమిస్తున్నామని, జిల్లాలో ఏడుగురు ఆ స్థాయి అధికారులు సర్వే చేస్తున్నారని వివరించారు.నవంబరు 15వ తేదీ నాటికి పరిశీలన పూర్తి చేసి ప్రభుత్వానికి స్టేటస్ రిపోర్టు అందజేస్తారని మంత్రి వివరించారు. ఇసుకపై ప్రజల్లో అపోహలున్నాయని అభిప్రాయపడిన మంత్రి ఇసుకను ప్రజలకు ఉచితంగా ఇస్తామన్నారు. సీనరేజీ విధిస్తే దానిపై జీఎస్టీ కూడా తోడై పేదలపై భారం పడుతుందనే ఆలోచనతో సీనరేజీ కూడా సీఎం తొలగించారన్నారు.ఎట్టిపరిస్థితుల్లోనూ ఇసుక అక్రమ రవాణాను, పక్క రాష్ట్రాలకు తరలించడాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. సత్యవేడు నియోజకవర్గం తమిళనాడు సరిహద్దుల్లో వుండడం, చెన్నై నగరానికి చేరువగా వుండడం వంటి కారణాలతో ఇసుక స్మగ్లింగ్ జరగకుండా కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించామన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. తిరుపతి ప్రాంతంలో గంజాయి, డ్రగ్స్ వాడకం పెరుగుతోందని, గత ప్రభుత్వ తప్పిదాలు, నిర్లక్ష్యమే దీనికి కారణమని ఆరోపించారు. గత ఐదేళ్ళలో వీటికి బానిసలుగా మారిన వారిని మంచి దారిలో నడిపించే ప్రయత్నం తమ కూటమి ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. తిరుపతి పరిసరాల్లో జాతీయ స్థాయి ఉన్నత విద్యా సంస్థలు అధికంగా వుండడం కూడా డ్రగ్స్ వినియోగం పెరగడానికి కారణం కావచ్చునన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం ద్వారా ఆయాచోట్ల అవగాహనా కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులను చైతన్యపరిచేందుకు, మార్పు తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సాల్, మున్సిపల్ కమిషనర్ మౌర్య తదితరులు పాల్గొన్నారు.





జాతీయ అవార్డు అందుకున్న కమిషనర్



మంత్రి నారాయణ నుంచి అవార్డు అందుకొంటున్న కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిలో మంగళవారం రాష్ట్ర మంత్రి నారాయణ నుంచి పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి జాతీయ అవార్డు అందుకొన్నారు. 2023-24 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వనిధి సే సంవృద్ధి పథకం అమలులో ఉత్తమ సేవలు అందించినందుకు ఈ అవార్డు లభించింది. మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, ఆర్‌ఓ రవిరెడ్డి, మున్సిపల్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. కమిషనర్‌ను మున్సిపల్ ఛైర్‌పర్సన్ చాముండి, పాలకవర్గ సభ్యులు అభినందించారు.

కబడ్డీ విజేతలు చిత్తూరు బాలికలు


విజేతగా నిలిచిన బాలిక జట్టు

చౌడేపల్లె, అక్టోబర్29 (ఆంధ్రజ్యోతి): అండర్-17 రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ విభాగంలో చిత్తూరు జిల్లా జట్టు విజేతగా నిలిచిందని పీఈటీ రాజేంద్ర వెల్లడించారు. మంగళవారం అన్నమయ్య జిల్లా రాయచోటిలో బాల, బాలికల కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. చిత్తూరు జిల్లా బాలికల జట్టు ఫైనల్లో శ్రీకాకుళం జట్టును మట్టికరిపించి విజేతగా అవతరించింది. బాలికల జట్టులో పల్లవి, సన, లిఖిత, లహిత, జాహ్నవి, అంజుం, హేమవతి, హేమశ్రీ, షాలిని, భాగ్యశ్రీ, కౌసల్యా, శ్వేత, అనిత, నందిని, రమ్య, డోలశ్రీ ఉన్నారు. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, టీడీపీ నాయ కులు మాదిరాజు లక్ష్మణరాజు, ఎంఈవో కేశవరెడ్డి, హెచ్‌ఎం నాగ రాజ రెడ్డి, యువ పారిశ్రామికవేత్త నవీన్‌కుమార్, బీజేపీ మండలాధ్యక్షుడు కడియాల మనోహర్ పలువురు ఉపాధ్యాయులు వీరిని అభినందిం చారు. ఇదిలా ఉండగా జిల్లా బాలురు కర్నూలుతో తలపడి నాలుగో స్థానంలో సరిపెట్టుకుంది.

ఏపీఐఐసీ భూముల విషయంలో తుది నిర్ణయం ప్రభుత్వానిదే: జేసీ


ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న అధికారులు

నగరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని వీకేఆర్ పురం శివారులో ఏపీఐఐసీకి కేటాయించిన భూములపై ప్రభుత్వానిదే తుది నిర్ణయమని జాయింట్ కలెక్టర్ విద్యాధరి తెలిపారు. ఈ ప్రాంతంలో క్రషర్ల ఏర్పాటుకు 2018లో దరఖాస్తు చేసుకున్నవారు అనుమతుల కోసం కలెక్టర్‌ను సంప్రదించగా ప్రజాభిప్రాయ సేకరణ, కాలుష్య పరిశీలన నిమిత్తం గ్రామసభ నిర్వహించారు. గ్రామస్తులు కొందరు మాట్లాడుతూ.. తమ పంచాయతీ పరిధిలో క్రషర్లకు అనుమతులిస్తే గ్రామ రెవెన్యూ పెరిగి, గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. మరికొందరు మాత్రం క్రషర్లకు అనుమతిస్తే కాలుష్యం నెలకొంటుందన్నారు. జేసీ మాట్లాడుతూ.. ప్రజల అభిప్రాయాలను, ఏపీఐఐసీ వారి వివరణను రికార్డు చేసి సీఎస్‌కు పంపుతామన్నారు. సీఎస్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఆర్డీవో వెంకటరెడ్డి, తహసీల్దార్ రవికుమార్, ఎన్విరాన్‌మెంట్, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

ఖోఖో విజేతలకు రూ.లక్ష నజరానా


క్రీడాకారులకు నగదు అందజేస్తున్న ఎంపీ ప్రసాదరావు

చిత్తూరు సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఖోఖో విజేతలకు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు రూ.లక్ష నజరానా అందజేశారు. ఇటీవల కాణిపాకం అగరంపల్లె జడ్పీ ఉన్నతపాఠశాలలో 43వ సబ్ జూనియర్ ఖోఖో పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఖోఖో పోటీల్లో విజేతలకు తనవంతు సాయంగా ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో విజయం సాధించిన క్రీడాకారులు ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రూ.లక్షను రాధే కన్‌స్ట్రక్షన్ ద్వారా విజేతలకు అందజేశారు. డీఎస్‌డీవో బాలాజి, కోచ్ రాజేష్, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు కాజూరు శీన, మహేష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పంటలను ధ్వంసం చేసిన గజరాజులు


చల్లావారిపల్లి వద్ద ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట దృశ్యం

కల్లూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజదాడులు కొనసాగుతూనే ఉన్నాయి. చల్లావారిపల్లి సమీపానికి సోమవారం రాత్రి రెండు గుంపులుగా చేరుకున్న 16 ఏనుగులు వరిపంట, నీటిపైపులు, పశుగ్రాసంను ధ్వంసం చేశాయి. రాతికూసాలు, మామిడిచెట్లను విరిచేశాయి. పాకాల మండలం పుల్లావాండ్లపల్లి సమీపంలోని అడవి నుంచి సుమారు 9 ఏనుగుల గుంపు, సదుం మండలం చీకలచేను సమీపంలోని అడవి నుంచి మరో 7 ఏనుగుల గుంపు సోమవారం రాత్రి పులిచెర్ల మండలంలోని చల్లావారిపల్లి వద్దకు చేరుకున్నాయి. రైతు శివకుమార్‌కు చెందిన అర ఎకరా వరిపంట, భాస్కర్‌కు చెందిన అర ఎకరా వరిపంట, ఎస్వీ రమణకు చెందిన మామిడిచెట్లు, జబ్బార్ మామిడితోటకు ఏర్పాటు చేసిన రాతి కూసాలను ఏనుగుల గుంపు విరిచేశాయి. మంగళవారం ఉదయం అమ్మచెరువు వద్ద తిష్ట వేశాయి. సమీప రైతులు అక్కడికి చేరుకోవడంతో గమనించిన ఏనుగుల గుంపు పాతపాళ్యం అడవివైపు వెళ్లాయి. ఏనుగులు ధ్వంసం చేసిన పంటలను ఎఫ్‌బీఓ శ్రీదేవి పరిశీలించారు. పంటల నష్ట పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలని బాధిత రైతులకు సూచించారు.

ఏనుగులు తిరుగుముఖం

పులిచెర్ల మండలం నుంచి పలమనేరు కౌండిన్య అడవి వైపు ఏనుగుల గుంపును మళ్లించాలని మూడు రోజులుగా శ్రమించిన తూర్పు, పశ్చిమ అటవీ విభాగం అధికారులు శ్రమకు ఫలితంలేకుండా పోతోంది. అటవీ రేంజర్ థామస్ సుకుమార్, డిప్యూటీ రేంజర్ కుప్పుస్వామి, ఎఫ్‌ఎస్‌ఓ షఫి సారథ్యంలో ఏనుగుల గుంపును మండలం నుంచి తరలించేందుకు ప్రయత్నించారు. ట్రాకర్స్ సాయంతో టపా కాయలు పేల్చి ముందుకు కదిలారు. అయినా సాయంత్రం చీకటిపడే సమయానికి ఏనుగుల గుంపు మండలంలోకి తిరుగుముఖం పడుతున్నాయి. దీంతో చేసేది ఏమీ లేక రాత్రి వేళ సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

సాధారణ నిధులన్నీ విద్యుత్ బిల్లులకేనా?

అభివృద్ధి పనులెలా జరుగుతాయి - నగరి మున్సిపల్ కమిషనర్


సమావేశంలో ప్రసంగిస్తున్న నీలమేఘం

నగరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సాధారణ నిధులన్నీ విద్యుత్ బిల్లులకే చాలకపోతే అభివృద్ధి పనులు ఎలా జరుగుతాయని నగరి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ప్రశ్నించారు. చైర్మన్ నీలమేఘం అధ్యక్షతన మంగళవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. విద్యుత్ బిల్లులే ట్రాన్స్‌కోకు రూ.6కోట్లు బకాయి ఉందని చెప్పారు. అందులో ఈటీపీ (రంగు నీళ్లను శుద్ధి చేసే) ప్లాంట్ మాత్రమే 2.60కోట్ల బకాయి ఉందన్నారు. ఈ ప్లాంటు మున్సిపాలిటీకి గుదిబండగా తయారైందన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులున్నా.. మున్సిపాలిటీ పరిధిలో 175 మోటార్ల ద్వారా నీరు అందిస్తున్నారని చెప్పారు. ఈ మోటార్లకే నెలకు రూ.18లక్షల విద్యుత్ బిల్లులు చెల్లిస్తుండటం విచారకరమన్నారు. వీధి దీపాలకు మరో రూ.10లక్షల బిల్లులు వస్తున్నాయని వివరించారు. పన్నుల వసూలులో చివరిస్థానంలో ఉన్నామని చెప్పారు. మున్సిపాలిటీకి రూ.4.30 లక్షల ఆస్తి పన్ను, రూ.2.09 లక్షల నీటిపన్ను బకాయిలున్నాయన్నారు. బకాయిల వసూలులో కౌన్సిలర్లు సహకరించి వసూలయ్యేలా చూడాలన్నారు. అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు విద్యుత్‌వాడకాన్ని అదుపుచేయాలని చైర్మన్ కోరారు. ఈటీపీ ప్లాంటు ప్రారంభంలో డయింగ్ యూనిట్ అసోసియేషన్ వారు చేసుకున్న ఒప్పందం ప్రకారం బాధ్యత చేపట్టాలన్నారు. అలా జరిగితేనే మున్సిపాలిటీకి విద్యుత్‌బిల్లు భారం తగ్గుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై బహిరంగ సభ


సమావేశానికి హాజరైన డ్వామా పీడీ రవికుమార్‌నాయుడు

పెనుమూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద పెనుమూరు మండలంలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీవరకు నిర్వహించిన పనులపై స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద 18వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభ మంగళవారం జరిగింది. సభకు హాజరైన డ్వామా పీడీ రవికుమార్‌నాయుడు మాట్లాడుతూ.. మండలంలో రూ.7.42కోట్లు ఖర్చు పెట్టినట్లు చెప్పారు. చిన్న చిన్న పొరబాట్లు ఉండటంతో రూ.50వేల ఫైన్ వేశామని, రూ.12,900 దుర్వినియోగం అయినట్లు గుర్తించి, రికవరీకి ఆదేశించామన్నారు. జిల్లా విజిలెన్స్ అధికారి ఉమావాణి, ఏపీడీ సుబ్రహ్మణ్యం, ఏపీవో గుణశేఖర్, ఎస్‌ఆర్‌పీ మల్లికార్జున, సచివాలయ ఉద్యోగులు, టెక్నికల్, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కరెంటు భూతాన్ని తరమండి : సీపీఐ


నిరసన తెలుపుతున్న సీపీఐ శ్రేణులు

చిత్తూరు సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కరెంటు భూతాన్ని తరమాలని ప్రజలకు సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక గాంధీరోడ్డులోని విద్యుత్ డివిజనల్ కార్యాలయం ఎదుట నగర కార్యదర్శి గోపీనాథ్ ఆధ్వర్యంలో ముఖానికి మాస్కులు ధరించి నిరసన చేపట్టారు. ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నేతలు గోపినాథ్, మణి, ఆర్ముగం రెడ్డి, దాసరి చంద్ర, విజయగౌరి, రమాదేవి, కోమల, కవిత తదితరులు పాల్గొన్నారు.

టపాసు బాక్సుల సీజ్

గుడిపాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండలంలోని తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన బొమ్మసముద్రం క్రాస్‌లో ఓ వ్యక్తి అనుమతి లేకుండా టపాకాయలను విక్రయిస్తున్నాడన్న సమాచారం మంగళవారం పోలీసులకు అందింది. తనిఖీ చేయగా టపాసు బాక్సులు కనిపించడంతో సీజ్‌చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు.

ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలి

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఛైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ అన్నారు. మంగళవారం కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు బ్యాంకు సిబ్బంది, అధికారులు నగరంలో మూడు కిలోమీటర్ల వాకథాన్ నిర్వహించారు. బ్యాంకు విజిలెన్స్ అధికారి రమణయ్య, జనరల్ మేనేజర్ ప్రభాహరన్, ఏజీఎం రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకంటే ఎక్కువగా కూటమి పార్టీల నేతలు

ఇంఛార్జి మంత్రి సత్యప్రసాద్ సమీక్షలో ఇదీ పరిస్థితి

తిరుపతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కలెక్టరేట్‌లో మంగళవారం మధ్యాహ్నం వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో ఇంఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై సమీక్ష జరిపారు. సుదీర్ఘంగా నిర్వహించిన ఈ సమీక్షా సమావేశంలో కీలక శాఖలకు సంబంధించి కార్యక్రమాల అమలు తీరుపై లోతుగా ఆరా తీశారు. అయితే సమావేశంలో కూటమి పార్టీలకు సంబంధించిన నేతలు కూడా మొదటి నుంచీ చివరి వరకూ పాల్గొనడం గమనార్హం. జిల్లా, డివిజన్ స్థాయి అధికారుల కంటే కూటమి పార్టీల నేతలు, ఛోటా నాయకులు, వారి అనుచరులే ఎక్కువమంది సమావేశంలో కనిపించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సాల్, మున్సిపల్ కమిషనర్ మౌర్య, డీఆర్వో పెంచల కిశోర్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తిరుపతి, సూళ్ళూరుపేట, శ్రీకాళహస్తి ఆర్డీవోలు, అన్ని శాఖల జిల్లా అధికారులతో పాటు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నానీ, బొజ్జల సుధీర్‌రెడ్డి, పాశం సునీల్ కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, ఎమ్మెల్సీ శ్రీకాంత్ సమావేశానికి హాజరయ్యారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి, సూళ్ళూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరు కాలేదు. ఈ సంగతి పక్కన పెడితే సమావేశంలో టీడీపీ తిరుపతి పార్లమెంటు కమిటీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, ఎస్సీవీ నాయుడు కూడా మంత్రి అధికారిక సమీక్షా సమావేశం ఆద్యంతం పాల్గొన్నారు. వీరితో పాటు ద్వితీయ శ్రేణి నాయకులు పెద్ద సంఖ్యలో సమావేశం హాల్లోకి చేరుకున్నారు. కుర్చీలు సరిపోక చాలామంది నిలుచుని పాల్గొనగా మొత్తం మీద మీటింగ్ హాలు కిటకిటలాడుతూ కనిపించింది. దీంతో ముఖ్యంగా జిల్లా కీలక అధికారులు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. వారిని సమావేశంలో వుండనివ్వాలా లేక పంపించి వేయాలా అన్నది తేల్చుకోలేక సతమతమయ్యారు. వుండనిస్తే ఎలాంటి విమర్శలు వస్తాయో, వెళ్ళిపొమ్మంటే పరిణామాలు ఎలా వుంటాయో అంతుబట్టక మిన్నకుండిపోయారు. అందులోనూ రెవిన్యూ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి తొలి సమీక్ష నిర్వహిస్తున్న సందర్భంలో ఆయన ఎలా ప్రతిస్పందిస్తారో అధికారులు అంచనాకు రాలేకపోయారు. దీంతో ఇబ్బందిగా వున్నప్పటికీ నిస్సహాయంగా సమావేశం కొనసాగించారు. మొత్తం మీద ఎలాంటి అధికారిక పదవులూ లేకపోయినా కేవలం అధికార పార్టీలను అడ్డుపెట్టుకుని నాయకులు అధికారిక సమీక్షా సమావేశంలో పాల్గొనడం తీవ్ర విమర్శలకు దారి తీసింది.

శ్రీసిటీలో పరిశ్రమల ప్రతినిధులతో మంత్రి భరత్ సమావేశం

పారిశ్రామికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపు


డైకిన్ పరిశ్రమలో మంత్రి పరిశీలన

శ్రీసిటీ, అక్టోబరు 29: నూతన పారిశ్రామిక విధానంతో రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అగ్రగామి పెట్టుబడుల కేంద్రంగా మార్చాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంలో భాగస్వాములు కావాలంటూ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పరిశ్రమల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ ఎస్.యువరాజ్‌తో కలిసి మంత్రి మంగళవారం శ్రీసిటీలో పర్యటించారు. తన పర్యటనలో భాగంగా ఇక్కడి పరిశ్రమల సీఈవోలు ఇతర ఉన్నతాధికారులతో సమావేశమైన మంత్రి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పారిశ్రామిక విధానం 4.0ను వారికి వివరించారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... నూతన పారిశ్రామిక విధానం ద్వారా రాబోయే ఐదేళ్లలో రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులను, 10 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులను ఆకర్షించడమే ధ్యేయంగా కార్యాచరణను అమలు చేస్తామన్నారు. ఈ విధానంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), ఎలక్ట్రానిక్స్, ఆహార శుద్ధి, పర్యావరణ హరిత శక్తి, ప్రైవేట్ పారిశ్రామిక పార్కులపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. సుస్థిర పారిశ్రామికాభివృద్ధిని పెపొందించుకుంటూ ఆవిష్కరణలు, అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించే ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలన్నదే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. సమావేశానికి హాజరైన వివిధ పరిశ్రమల ప్రతినిధులు నూతన పారిశ్రామిక విధానాన్ని హర్షించారు. ముఖ్యంగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని ప్రశంసించారు. ఎంఎస్ఎంఈలు, ఎలక్ట్రానిక్స్ రంగాలకు ఉద్దేశించిన ప్రోత్సహకాలను అభినందిస్తూ, పెండింగ్‌లో ఉన్న ప్రోత్సహకాలను ప్రభుత్వం త్వరగా రీయింబర్స్‌మెంట్ చేయాలని కోరారు. అభివృద్ధి చెందుతున్న పరిశ్రమల అవసరాలకనుగుణంగా వృత్తి, శిక్షణ కార్యక్రమాలలో పెట్టుబడులను పెంచాలని సూచించారు. శ్రీసిటీలో పారిశ్రామికవర్గానికి నూతన పారిశ్రామిక విధానం, దాని ముఖ్య అంశాలను వివరిస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినందుకు శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

అర్హులందరికీ 3 ఉచిత సిలిండర్లు : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన మూడు ఉచిత సిలిండర్ల పథకం అర్హులందరికీ వర్తింపజేస్తారని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. 2025 మార్చి 31వ తేదీ వరకు మొదటి ఉచిత సిలిండర్ పొందే అవకాశం ఉందని.. అర్హులకు ఆత్రుత, ఆందోళన వద్దని సూచించారు. గ్యాస్ ఏజెన్సీలో బుకింగ్ చేసుకున్నాక నిర్ణీత ధర చెల్లించి సిలిండర్ తీసుకోవాలన్నారు. అర్హులైతే సెల్‌ఫోన్ నెంబరుకు సంక్షిప్త సందేశం వస్తుందన్నారు. బ్యాంకు ఖాతాకు రెండ్రోజుల్లోగా సొమ్ము జమ అవుతుందని పేర్కొన్నారు.

3,4 తేదీల్లో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

ఐరాల (కాణిపాకం), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను నవంబరు 3,4 తేదీల్లో పూతలపట్టులోని శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపంలో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు తదితరులు ఆవిష్కరించారు. పాఠశాల హెచ్‌ఎంలు చంద్రశేఖర్‌నాయుడు, సురేష్‌బాబు, టీచర్లు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు ఢీకొని వృద్ధురాలి దుర్మరణం


రాధమ్మ మృతదేహం

బంగారుపాళ్యం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సు ఢీకొన్న సంఘటనలో ఓ వృద్ధురాలు దుర్మరణం చెందారు. మండలంలోని ఓ ప్రైవేటు స్కూల్ బస్సును గుండ్లకట్టమంచి దళితవాడలో మంగళవారం ఉదయం వెనకకు నడుపుతుండగా అదే గ్రామానికి చెందిన రాధమ్మను ఢీకొంది. ఈ ప్రమాదంలో రాధమ్మ (78) అక్కడికక్కడే మృతిచెందగా, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కిరణ్ తెలిపారు.

'ఉల్లాస్'ను విజయవంతం చేయండి

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నవంబరు రెండో తేదీనుంచి అమలు చేయనున్న ఉల్లాస్ (సమాజంలో అందరికీ జీవితకాల అభ్యసన అవగాహన) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జడ్పీ సీఈవో, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ రవికుమార్‌నాయుడు పిలుపునిచ్చారు. కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఎంపీడీవో, సెర్ప్ ఏపీఎంలకు ఉల్లాస్‌పై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నిరక్షరాసులకు ఆర్థిక డిజిటల్, క్రియాత్మక అక్షరాస్యతపై అవగాహన కల్పించడమే ఉల్లాస్ లక్ష్యమన్నారు. వయోజన విద్యాశాఖ, డీఆర్‌డీఏ సమన్వయంతో జిల్లాలో గుర్తించిన 9,078 మంది నిరక్షరాసులకు 2024-25 విద్యా సంవత్సరానికి ఆరు నెలల పాటు శిక్షణ ఇవ్వాలన్నారు. వయోజనవిద్య ఏడీ నాగేశ్వరరెడ్డి, ఏపీడీలు, ఎంపీడీవో, డీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం, పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం, పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జడ్పీసీఈవో రవికుమార్ నాయుడు, డీపీవో పార్వతితో కలిసి ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలతో సమీక్షించారు. సీసీరోడ్లు మంజూరైన మండలాల్లో అందుకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది పనితీరును పరిశీలిస్తూ.. గైర్హాజరైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మహిళను వేధించిన కేసులో రెండేళ్ల జైలు

పూతలపట్టు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మహిళను వేధించిన యువకుడికి చిత్తూరు న్యాయస్థానం రెండేళ్ల జైలు, జరిమానా విధించింది. ఓ మహిళ గంగాధరనెల్లూరు మండలం వేల్కూరు దళితవాడకు చెందిన జానకిరామ్ అనే యువకుడితో స్నేహంగా మెలిగేది. ఆ తర్వాత ఆమెకు మరో వ్యక్తితో వివాహమైంది. అయితే జానకిరామ్ మాత్రం ఆ మహిళను సెల్‌ఫోన్ ద్వారా మెసేజ్‌లు పంపుతూ వేధించేవాడు. దీనిపై ఆమె 2022 సెప్టెంబరు 22వ తేదీన ఎన్‌ఆర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు మంగళవారం చిత్తూరులోని మొదటి అదనపు జూనియర్ సివిల్ కోర్టులో వాయిదాకు వచ్చింది. జానకిరామ్‌పై నేరం రుజువుకావడంతో అతడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.2500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి మాధవి తీర్పు చెప్పారు. ఈ కేసును ఏపీపీ స్వాతి వాదించారు.

టీఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడి హఠాన్మరణం


ప్రదీప్‌చౌదరి (ఫైల్ ఫొటో)

పెనుమూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): టీఎన్ఎస్ఎఫ్ జీడీనెల్లూరు ఉపాధ్యక్షుడు పెనుమూరుకు చెందిన ప్రదీప్‌చౌదరి మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో టాయిలెట్‌కు వెళ్లి ఎంతసేటికీ తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల వారితో కలిసి కుటుంబీకులు తలుపు పగులగొట్టి చూడగా ప్రదీప్ కిందపడి పోయి ఉన్నాడు. పక్కనే ఉన్న ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ హఠాన్మరణం విషయం తెలియడంతో టీడీపీ శ్రేణులు దిగ్భ్రాంతికి గురయ్యాయి. మృతదేహానికి పూలమాలలు వేసి, పలువురు టీడీపీ నేతలు నివాళి అర్పించారు.

గాయపడ్డ మహిళ మృతి


మృతి చెందిన మమత

బంగారుపాళ్యం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద ఈనెల 26వ తేదీ రాత్రి జరిగిన ప్రమాదంలో యాదమరి మండలం ఆరిమాకులపల్లెకు చెందిన మమత గాయపడ్డారు. ఈమె చిత్తూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారని ఏఎస్ఐ రామచంద్రారెడ్డి తెలిపారు.

వైభవంగా కల్యాణ వెంకన్న పవిత్ర సమర్పణ




చంద్రగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రెండోవ రోజైన మంగళవారం పవిత్రోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉద యం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, మూలవర్లకు అభిషేకం, తోమాల సేవ, కొలువు పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేశారు. పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, రక్షాబంధనం, అన్నప్రానాయనం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల వరకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. పాలు, పెరుగు, తేనే, చందనం, కొబ్బరినీళ్ళతో విశేషంగా అభిషేకం చేశారు. మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ చేశారు. సాయంత్రం స్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించి తిరుచ్చిపై మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, అనంబట్టు ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, పార్థసారథి, శేషాచార్యులు నారాయణాచార్యులు, జమేదర్ చిరంజీవి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

CFC
CHENNAI FERTILITY CENTRE

చెన్నై ఫెర్టిలిటీ సెంటర్

సంతానం లేని దంపతులకు శుభవార్త !

దీపావళి ప్రత్యేక ఆఫర్

20%
తగ్గింపు
IVF, ICSI, IUI చికిత్స
95%
సక్సెస్ రేటు






ప్రపంచ రికార్డు
70000+
IVF/ICSI బేబీస్ విజయవంతంగా
ప్రపంచ వ్యాప్తంగా డెలివరీ
చేయబడ్డాయి



DR. V.M. THOMAS. PH.D., F.S.A.B.
MLA, GD Nellore
EMBRYOLOGY TYCOON AND
ICSI MAESTRO
CHAIRMAN - CHENNAI FERTILITY CENTRE

బుకింగ్ కోసం: 90252 50000, 93439 30009




79/129, నెల్సన్ మాణికం రోడ్
అమింజికర్రై, చెన్నై - 600 030
తమిళనాడు, భారతదేశం.




నం: 1, మొదటి ప్రధాన రహదారి
కామరాజ్ సలై ఇలంగో నగర్
పాండిచ్చేరి - 605011.
భారతదేశం



18-1-502/ A, K.T. రోడ్డు
భవానీ నగర్
తిరుపతి, చిత్తూరు జిల్లా
ఆంధ్రప్రదేశ్ -517501



EN-52, స్ట్రీట్-8, సెక్టార్-V, సాల్ట్
లేక్, కోల్‌కతా-700091, పశ్చిమ
బెంగాల్



స్క్వేర్ ప్లాట్ నెం # 3,4,4a & 6,
మెట్రో పిల్లర్ #1735 ఎదురుగా:
COD, దుర్గం, చెరువు రోడ్
మాదాపూర్, Hyd -500033 T.S.,
భారతదేశం



ఇంటి సంఖ్య#519
రోడ్డు#1, ధన్మొండి#1
ఢాకా - 1205
బంగ్లాదేశ్

పలమనేరు
కుప్పం/పుంగనూరు

హెచ్ఎం తిలగవతి దంపతులకు సన్మానం



పలమనేరు, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ఎంపీపీ పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తూ ఈనెల 30 వ తేదీ ఉద్యోగ విరమమణ చేస్తున్న తిలగవతి దంపతులను ఘనంగా సన్మానించారు. శాలువలు కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు.

నేటి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్

కల్లూరు,అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో ఫ్రీ గ్యాస్ సిలిండర్లు పొందేందుకు అర్హత ఉన్న లబ్ధిదారులు బుధవారం నుంచి బుకింగ్ చేసుకోవచ్చని తహసీల్దార్ జయసింహ తెలిపారు. అక్టోబరు 31 నుంచి 2025 మార్చి 31 వరకు తొలి ఉచిత సిలిండర్ బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

కుప్పం: బీపీఎల్ రేషన్ కార్డుదారులు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 2025 మార్చి 31వ తేదీ దాకా ఎప్పుడైనా మొదటి ఉచిత వంట గ్యాస్ సిలిండర్‌ను పొందవచ్చని కుప్పం తహసీల్దారు తెలిపారు.

వీధి కుక్కల దాడిలో లేగదూడలకు గాయాలు

సోమల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సోమలలో మంగళవారం వీధి కుక్కలు స్వైరవిహారం చేసి లేగదూడలను తీవ్ర గాయాలు చేశాయి. చిన్నపిల్లలు బడులకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల తల్లిదండ్రులు తోడు లేనిదే ఇంటి నుంచి బడికి వెళ్ల లేకపోతున్నారు. బస్టాండ్‌లో పాదచారుల, ద్విచక్రవాహనాల వెంట బడుతున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సీపీఎం జిల్లా మహాసభలు విజయవంతం చేయండి

పలమనేరు, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా 14వ సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపునిచ్చారు. పలమనేరు సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సీపీఎం నాయకులు గిరిధరగుప్తా, ఓబుల్‌రాజు, భువనేశ్వరి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సౌందర్యలహరి పారాయణం

చౌడేపల్లె, అక్టోబరు29:: పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవి ఆలయంలో మదనపల్లెకు చెందిన వాసవి వనితా క్లబ్ సభ్యులు భక్తిశ్రద్ధలతో సౌందర్య లహరి పారాయణం నిర్వహించారు. నిర్వాహకులు శ్రావణి, వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.

రీసర్వేలో భూమి విస్తీర్ణం తగ్గించారు న్యాయం చేయండి



అధికారులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతు రమణప్ప

బైరెడ్డిపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలనలో చేపట్టిన భూముల రీసర్వేలో తమకు ఉన్న 2 ఎకరాల 93 సెంట్ల భూమిని 41 సెంట్లు తగ్గించి 2 ఎకరాల 52 సెంట్లుగా ఆన్‌లైన్‌లో నమోదుచేసి పట్టాదారు పాసుపుస్తకం ఇచ్చారని మండలంలోని కుప్పనపల్లె గ్రామానికి చెందిన రైతు రమణప్ప ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పాతూరునత్తంలో జరిగిన రెవిన్యూ గ్రామసభలో ఆయన అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. కొత్తగా మంజూరుచేసే పట్టాదారు పాసుపుస్తకంలో 2.93 సెంట్లుగా నమోదుచేసి ఇవ్వాలని విన్నవించారు. టీడీపీ మండల ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, డీటీ అశోక్, సర్వేయర్ రామాంజులు, వీఆర్వో గురివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ హుండీ ఆదాయం రూ.9.36 లక్షలు

కుప్పం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయం హుండీని మంగళవారం లెక్కించారు. మొత్తం రూ.9,36,070 నగదు లభించింది. 40.100 గ్రాముల బంగారం, 0.28 గ్రాముల వెండి కానుకలు అందాయి. ఈ లెక్కింపులో దేవదాయ శాఖ ఈవో చలపతి, ఆలయ మాజీ ఛైర్మన్లు, సభ్యులు, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై పోక్సో కేసు నమోదు

పుంగనూరు రూరల్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలానికి చెందిన ఓ బాలికపై అత్యాచారం కేసులో ఇద్దరు యువకులపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. చౌడేపల్లె మండలం 29ఏ చింతమాకులపల్లె పంచాయతీ బయ్యప్పల్లెకు చెందిన చరణ్(22), పుంగనూరు మండలం గూడూరుపల్లెకు చెందిన భార్గవ్ అత్యాచారం చేసినట్లు బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన పలమనేరు ఆర్డీవో

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఆర్డీవో భవానిశంకరి మంగళవారం చిత్తూరులో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పలమనేరు డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలన్నీ త్వరగా పరిష్కరించాలని ఆమెకు కలెక్టర్ సూచించారు.

కేడీసీలో ముందస్తు దీపావళి వేడుకలు



కుప్పం, అక్టోబరు 29: కుప్పంలోని కుప్పం డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులు ముందస్తు దీపావళి వేడుకలు చేసుకున్నారు. పూలు అలంకరించి, రంగవల్లులు తీర్చిదిద్దారు. మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగించి కళాశాల ప్రాంగణాన్ని శోభాయమానం చేశారు. విద్యార్థినులు సంప్రదాయ వస్త్ర ధారణలో పూజలు చేసి, సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ఛైర్మన్ సాగర్ రాజ్ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయం దీపావళి సందర్భమని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.సుధారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు నిత్యశ్రీ



కుప్పం రూరల్, అక్టోబరు 29: మండలంలోని టి.సదుమూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థిని నిత్యశ్రీ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పద్మనాభరాజు తెలిపారు. ఈ నెల 27వ తేదీన తిరుపతి జిల్లా సత్యవేడు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీలలో ఆమె అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. నిత్యశ్రీని హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు మంగళవారం అభినందించారు.

శ్మశానాల ఆక్రమణలపై స్పందించాలి

సోమల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు చోట్ల శ్మశాన భూములు ఆక్రమణపై రెవెన్యూ అధికారులు స్పంచదించాలని ఇరికిపెంట సర్పంచు రెడ్డెప్ప కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ మండల సమావేశం ఎంపీపీ ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగింది. పేటూరు, వల్లిగట్ల, చిన్నకమ్మపల్లె ప్రాంతాల్లో ఎస్సీలకు శ్మశాన వాటికల కోసం పదేళ్లగా పోరాటం చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. ఎంఈవో శివరత్న, తహసీల్దార్ బెన్నురాజ్, నాయకులు మొగిల్వీర్, రామనాథం, ప్రకాశ్, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం శ్రేష్టం

కుప్పం, అక్టోబరు 28: సాగు చేసే వంగడాలు ఏవైనా, ప్రకృతి వ్యవసాయం చేయడం అటు వ్యవసాయ భూమికి, ఇటు రైతుకు ఎంతో శ్రేష్టమని ఏవో అమృతవల్లి, ఉద్యాన శాఖాధికారి డింపు ప్రియ, సెరికల్చర్ ఏడీ హనుమంత రాయలు అన్నారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని శీగలపల్లె గ్రామంలో జి.కృష్ణమూర్తి పొలంలో మంగళవారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, పశు సంవర్థక, వ్యవసాయ, సెరికల్చర్, ఉద్యాన శాఖల సిబ్బంది, జనసేన నియోజకవర్గ కో-ఆర్డినేటర్ నరేశ్ పాల్గొన్నారు.

కల్లూరు: పులిచెర్ల మండలం చిన్నబెస్తపల్లి, తుడుంవారిపల్లిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ శ్రీనివాస్ మాట్లాడుతూ వరిసాగులో డ్రమ్ సీడర్ పద్ధతిపై అవగాహన పెంచుకోవాలన్నారు. మిరపలో తెగుళ్లు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

జాబ్‌మేళాలో 18మంది ఎంపిక

పుంగనూరు రూరల్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): పుంగనూరు ప్రభుత్వ మైనార్టీ ఐటీఐలో జరిగిన జాబ్‌మేళాలో 18మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఐటీఐ కాలేజీ ఆవరణలో వివిధ బహుళ జాతీయ కంపెనీలు నిర్వహించిన జాబ్‌మేళాకు 38మంది హాజరు కాగా 18మందిని ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ కంపెనీల నిర్వాహకులు, స్కిల్‌హబ్ కో-ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, సిసింద్రి, అబ్దుల్ హాజరైనట్లు తెలిపారు.

ఆదర్శ నియోజకవర్గంగా కుప్పం



- రూ.50 కోట్లతో కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధి
- నియోజకవర్గ అభివృద్ధికి రూ.కోట్లతో ప్రతిపాదనలు
- యువతకు ఉపాధి కల్పనావకాశాలు
- కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గాన్ని ఆరు నెలల్లో ఆదర్శ నియోజకవర్గంగా మార్చి చూపిస్తామని కడా పీడీ వికాస్ మర్మత్ చెప్పారు. పురపాలక సంఘాన్ని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం రూ.50 కోట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే రూ.కోట్ల రూపాయలతో కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రతిపాదనలు రూపొందించామని, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు పారిశ్రామిక, సాఫ్ట్‌వేర్ తదితర సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకున్నామన్నారు. కడా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించిన అభివృద్ధి వివరాలు ఇవీ.

- కుప్పం పురపాలక సంఘానికి మంజూరైన రూ.50 కోట్లతో మొదటి విడతలో ఆర్టీసీ బస్టాండు, ఉద్యానవనాల అభివృద్ధి చేపడుతారు. అనంతరం రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాల వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తారు.
- నియోజవర్గంలో మురుగు కాలువల నిర్మాణం, మరమ్మతులకు రూ.110 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు.
- రోడ్ల మరమ్మతులకు రూ.15 కోట్లు, పాఠశాలలకు రూ.110 కోట్లు, హాస్టళ్లకు రూ.15 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.
- జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ కుళాయి బిగించి, తాగునీటి సమస్య తీర్చదానికి రూ.93 కోట్లతో ప్రతిపాదనలు రూపొందాయి.
- నియోకవర్గంలో ఇప్పటికే రూ.30 కోట్లతో ఎన్ఆర్ఈజీఎస్ కింద రోడ్లు, గోకులం షెడ్లు వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.
- త్వరలో హౌసింగ్, వంట గ్యాస్ సర్వే.
- ఎన్టీఆర్ సుజల పథకానికి రూ.10 కోట్లను కేటాయించి, నియోజకవర్గ పరిధిలోని 7 మదర్ ప్లాంట్లను పునరుద్ధరించి, శుద్ధ జలాన్ని అందిస్తారు.
- నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ సోలార్ కనెక్షన్ ఇవ్వడానికి ప్రణాళిక చేపడుతున్నారు. ప్రభుత్వం, ప్రజలు 60:40 నిష్పత్తిలో నిధుల వ్యయంతో ఈ కనెక్షన్‌లు ఇస్తారు. 2025 డిసెంబరు నెలకల్లా ఇంటింటికీ సోలార్ విద్యుత్తు కనెక్షన్ ఇచ్చే పని పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు.
- కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రూ.20 లక్షల వ్యయంతో బెడ్లు, బెడ్ షీట్లు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు.
- నియోజకవర్గంలో ఎలప్, కెవిన్ కేర్, జ్యూబెంట్ వంటి మొత్తం ఏడెనిమిది కంపెనీలు తమ బ్రాంచ్‌లను ఏర్పాటు చేయడానికి ఉత్సాహం చూపిస్తున్నాయి. ఇప్పటికే 5 సంస్థలు ఎంవోయూ కుదుర్చుకున్నాయి. ఈ కంపెనీల కోసం కలెక్టర్ సహకారంతో 4 వేల ఎకరాల భూమిని గుర్తించారు. కంపెనీలన్నీ అనుకున్నట్లు ఇక్కడ బ్రాంచిలు ఏర్పాటు చేస్తే నియోజకవర్గంలో మొత్తం 7 వేల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.
- అంగన్వాడీ సెంటర్లలోని చిన్నారులకు మెదడు సంబంధిత వ్యాధులతో పాటు ఇతర ఆరోగ్య వ్యవహారాలపై కేర్ తీసుకునేందుకు 'కేరాన్‌గో'కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నారు.
- నియోజకవర్గంలో ఈజీ మార్ట్ ఏర్పాటు చేస్తారు.
- ద్రావిడ వర్శిటీ విద్యార్థులకు వివిధ అంశాలపై సాంకేతిక శిక్షణ ఇవ్వడానికి యూఎస్‌యేకు చెందిన వన్ అండ్ వన్ బి సంస్థతో ఎంఓయూ కుదుర్చుకుంటున్నారు. ఈ సంస్థ బ్యాచ్‌కు 100 మంది చొప్పున ఏడాదికి 1000 మంది యువతకు శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కూడా తానే కల్పిస్తుంది.
- ఆర్టీసీ డిపోలో పాత బస్సులను ఎలక్ట్రికల్ బస్సులుగా తయారు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. సంక్రాంతికి ప్రయోగాత్మకంగా ఒక ఎలక్ట్రిక్ బస్సును సిద్ధం చేసి ప్రారంభిస్తారు. ఫలితాలను బట్టి, తర్వాత ముందుకు వెళ్తారు.
- నియోకవర్గంలో ఎయిర్ పోర్టుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపారు. భూముల సేకరణ ప్రయత్నాలు కొలిక్కి వచ్చాయి.
- ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం నవంబరు నెల 13 నుంచి ప్రజా దర్బార్ నిర్వహిస్తారు. గ్రామాలకు వెళ్లి సభలు పెట్టి సమస్యలకు పరిష్కారం చూపుతారు.

పటిష్ట బందోబస్తుతో రొంపిచెర్ల మండలమీట్



మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తంరెడ్డి

రొంపిచెర్ల,అక్టోబరు29: (ఆంధ్రజ్యోతి) రొంపిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశం పటిష్ట పోలీసుల బందోబస్తుతో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వం మారిన తర్వాత రెండు సమావేశాలు కోరం సభ్యులు లేక వాయిదా పడ్డాయి. మూడవ సమావేశం కావడంతో అధికారులు డీఎస్పీ సాయినాథ్ పర్యవేక్షణలో సుదర్శనప్రసాద్, మునిస్వామి ఇద్దరు సీఐలు, వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, చిరంజీవి, ధరణి, ఎస్ఐలు, 15మంది ఎస్‌టీఎఫ్, 16 మంది పోలీసులతో కార్యాలయం వద్ద పికెటింగ్ నిర్వహిం చారు. మండల మీట్‌లో ఎంపీపీ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధికి ఏ ప్రభుత్వం అయినా తాము అడ్డురామని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు చేసిన పనులకు బిల్లులు రాలేదని, సచివాలయ సిబ్బంది పెన్షన్లు నిలపకుండా ఇవ్వాలని కోరారు. పార్టీలకు అతీతంగా గృహనిర్మాణ బిల్లులు చెల్లించాలని కోరారు. రైతు భరోసా కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయని, రూ.40 లక్షలతో నిర్మిస్తున్న రైతు గోదాములు చిన్న వర్షాలకు ఉరుస్తున్నాయని జాండ్లవారిపల్లె సర్పంచ్ నాగిరెడ్డి ఆరోపించారు. ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి స్పందిస్తూ సర్పంచ్‌ల సహకారంతో తీర్మానాలు చేస్తామన్నారు. మండలంలో 500 గృహాలు నిర్మించలేదని నెలలోపు పూర్తిచేయకుంటే ఈపథకం రద్దు అయ్యి లబ్ధిదారులు నష్టపోతారని తెలియజేశారు. ఈ ఇళ్ల నిర్మాణాలు వచ్చే కొత్త పథకాలకు వర్తించబోవన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు విజయశేఖర్, నూలురెడ్డెప్ప, జడ్పీటీసీ చిచ్చిలి రెడ్డీశ్వరరెడ్డి, ఎంపీటీసీలు సిరాజ్‌పున్నీషా, రమణమ్మ, సర్పంచులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంది మాంసం కేసు తేలేదెప్పుడు?

పలమనేరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పంది మాంసం పట్టుబడ్డ కేసులో పలమనేరు అటవీశాఖ అధికారులు వ్యవహరించిన తీరుపై ఉన్నతాధికారులు త్వరగా చర్యలు తీసుకో లేదని నిందితులు వాపోతున్నారు. ఆగస్టు 13వ తేదీ గంగవరం మండలం బండమీద జరావారి పల్లికి చెందిన హరికృష్ణారెడ్డి, నాగరాజు, మల్లీశ్వర కురప్పల్లికి చెందిన సుబ్రమణ్యంరెడ్డి కల్లి బండపై పందిని కోసి మాంసం సిద్ధం చేస్తుండగా ఎఫ్‌బీఓ హరున్‌బాషా పట్టుకున్నారు. తాము ఊరపందిని కొనుగోలు చేసి మాంసం సిద్ధం చేసుకుంటున్నట్లు చెప్పినప్పటికీ అడవిపంది మాంసం అని కేసు నమోదు చేశారని వారు వాపోతున్నారు. తమ వద్ద అటవీశాఖ అధికారులు రూ.1.60 లక్షలు వసూలు చేశారని, రోజూ వచ్చి అటవీశాఖ కార్యాలయంలో సంతకాలు పెట్టాలని తిప్పించుకొన్నారంటున్నారు. వసూలు చేసిన సొమ్ముకు రశీదులు ఇవ్వలేదని చెబుతున్నారు. పలమనేరు అటవీశాఖ కార్యాలయంలో విచారించగా నిందితులకు కాంపౌండింగ్ కట్టించేందుకు డీఎఫ్‌వోకు నివేదిక పంపించామని, అక్కడే కేసు పెండింగ్‌లో వుందని తెలిపారు. కేసు నమోదు చేసిన సమయంలో ఉన్న రేంజర్ శివన్న, డీఎఫ్ఓ చైతన్యకుమార్ రెడ్డి బదిలీపై వెళ్లిపోయారని ఇప్పుడున్న డీఎఫ్ఓ అయినా న్యాయం చేయాలని కోరుతున్నారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఏర్పాటు

రొంపిచెర్ల, అక్టోబరు29, (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండల యూటీఎఫ్ కార్యవర్గం మంగళవారం ఏకగ్రీవమైనట్లు జిల్లా ఆసంఘం ఎన్నికల అధికారి ఈశ్వరమహేంద్ర తెలిపారు. యూటీఎఫ్ అధ్యక్షుడుగా ఎస్.రమణయ్య, గౌరవాధ్యక్షుడుగా సి.మోహన్, సహ అధ్యక్షులుగా వెంకటేష్, కే.లత, ప్రధాన కార్యదర్శిగా పి.యాసిన్, కోశాధికారిగా చెంగారెడ్డి ఎన్నికయ్యారు,

కేంద్ర మంత్రిని కలిసిన టీడీపీ నేత లక్ష్మణరాజు



చౌడేపల్లె, అక్టోబరు29,(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడును టీడీపీ నాయకులు మాదిరాజు లక్ష్మణరాజు కలిశారు. మంగళవారం మంత్రిని ఆయన విమానాశ్రయంలో కలసి శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనతో పుంగనూరులో యువతకు ఉపాధి కల్పన కోసం పరిశ్రమలు తీసుకు రావాలని కోరినట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరాం చినబాబు పాల్గొన్నారు.

పెయ్యదూడలతో ఆర్థిక అభివృద్ధి



బహుమతులు ఇస్తున్న చిత్తూరు పశువైద్య ఉపసంచాలకులు, అధికారులు

రొంపిచెర్ల, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): పెయ్య దూడలతో పాడి రైతులు ఆర్థికంగా ఎదుగుతారని చిత్తూరు పశువైద్యశాఖ ఉపసంచారకులు డాక్టరు మహమ్మద్ ఆరిఫ్ అన్నారు. మంగళవారం రొంపిచెర్ల మండలం గాను గచింత పంచాయతీలో రాష్ట్రీయ గోకుల్ సంకరజాతి పెయ్య దూడల పదర్శన జరిగింది. ఈ ప్రదర్శనకు మద్దిపట్లవారిపల్లె, లోకావారిపల్లె, కల్లావారి పల్లె, మట్టావారిపల్లె నుంచి ఒక్క రోజు నుంచి ఏడాది వయస్సు ఉన్న దూడలు వచ్చాయి. ఉత్తమ దూడలకు బహుమతులు ఇచ్చారు. పశుగణాభి వృద్ధి సంస్థ ఉప సంచారకులు బాలసుబ్రమణ్యం, రొంపిచెర్ల, కల్లూరు, పులిచెర్ల, సోమల, సదుం పశువైద్యాధికారులు డాక్టరు శ్రీధర్, డాక్టరు తబ్రిష్‌బాష, డాక్టరు మునిచంద్ర, చందనప్రియ, డాక్టరు శ్రీహరి, డాక్టరు ప్రదీప్, పశుసంతితి పరీక్షకేంద్రం వైద్యులు ఆదిత్య, మౌనిక, యోగానంద సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలు

చౌడేపల్లె, అక్టోబరు29:(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని బయప్పల్లెకు చెందిన జగజీవన్ రెడ్డి మదనపల్లె నుంచి చౌడేపల్లెకు వస్తుండగా బోయకొండ సమీపంలోని అటవీ ప్రాంతంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. అయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతి స్విమ్స్‌కు తరలించారు.

యునానీ ఆస్పత్రి ఏర్పాటు చేయండి



మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసిన అయూబ్‌ఖాన్

పుంగనూరు రూరల్, అక్టోబరు29(ఆంధ్రజోతి): పుంగనూరులో ప్రభుత్వ యునానీ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరినట్లు బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పి.అయూబ్‌ఖాన్ తెలిపారు. మంగళవారం అమరావతి సచివాలయంలో మంత్రిని కలసి పుంగనూరు సమస్యలపై వినతిపత్రం అందజేశామని వివరించారు. పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో శ్రీగంధం చెట్టు చోరీ జరిగిందని, అక్కడ పనిచేసే హెడ్‌నర్సు రోగులు, సిబ్బంది పట్ల ప్రవర్తిస్తున్న తీరుపై ఆస్పత్రికి తనిఖీ చేసిన విచారణ చేయాలని కోరినట్లు తెలియజేశారు. పుంగనూరు బీజేపీ నాయకులు నరసింహులు, అమర పాల్గొన్నారు.

టపాకాయల దుకాణదారులు అప్రమత్తంగా ఉండాలి



పుంగనూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ నేపథ్యంలో పుంగనూరు బీఎంఎస్ క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన టపాకాయల దుకాణాల వద్ద యజమానులు ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తెలిపారు. మంగళవారం ఆయన టపాకాయల దుకాణాలను పరిశీలించారు. మంటలు ఆర్పే సిలిండర్లు, ఇసుక, నీరు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

పుంగమ్మకు గెరిగెల చెల్లింపు

పుంగనూరు రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ముళబాగిల్ రోడ్డులో వెలసిన పుంగమ్మ చెరువుకట్టపై వెలిసిన పుంగమ్మ దేవతను కుమ్మరివీధి ప్రజలు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో గెరిగెలు చెల్లించారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు.

ఖాకీ నీడన పుంగనూరు మున్సిపల్ సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా

పుంగనూరు, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): పుంగనూరు మున్సిపల్ అత్యవసర సర్వసభ్య సమావేశం మంగళవారం పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా జరిగింది. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శ్రీనివాసులు, ఏఎస్ఐ మహేంద్ర ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ ఛైర్మన్ ఎస్.అలీంబాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ రెడ్డెమ్మ మాట్లాడుతూ పట్టణ పరిధిలో అక్రమ లేఅవుట్లల్లో మున్సిపల్ అధికారులు బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. కౌన్సిలర్ కిజర్‌బాషా మాట్లాడుతూ మున్సిపాలిటీలో సర్వేయర్ లేకపోవడంతో ప్రజలకు సర్వే నెంబర్లు ఇవ్వడానికి అధికారి లేక భూముల రిజిస్ట్రేషన్‌లు జరగడంలేదన్నారు. పట్టణంలో కుక్కల బెడద నివారించాలని కోరారు. ఛైర్మన్ అలీంబాషా మాట్లా డుతూ ప్రజలు పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. కమిషనర్ మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే కుక్కలు పట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ పరిధిలో సర్వే నంబర్లు ఇవ్వడానికి వీఆర్వోలను సంప్రదించాలని సూచించారు. అనంతరం అజెండా అంశాలను కౌన్సిలర్ కిజర్ ప్రతిపాదించగా కౌన్సిలర్లు ఆమోదం తెలపడంతో మున్సిపల్ మీట్ ప్రశాంతంగా ముగిసింది. ఈ సమావేశంలో మున్సిపల్ డీఈఈ మహేశ్, మేనేజర్ విజయభారతి, ఏఈ కృష్ణవేణి, వైస్ ఛైర్మన్లు నాగేంద్ర, లలిత, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

చిత్తూరు కల్చరల్ అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతే స్వచ్ఛభారత్ లక్ష్యమని జిల్లా ఆడిట్ అధికారి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న మేరా యువ భారత్ సంఘటన్ వార్షికోత్సవాల్లో భాగంగా పాత కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కేంద్రం జిల్లా అధికారులు ప్రదీప్, బాబురెడ్డి, గిరింపేట ట్రేడర్స్ యూనియన్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన సదస్సు

యాదమరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహనకు సివిల్ రైట్స్ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పార్థసారథి అన్నారు. మంగళవారం పెరుమాళ్లపల్లె గ్రామంలో సదస్సు నిర్వహించారు. ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో సురేష్, నాయకులు మురుగేషన్, నాగరాజు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది


రైతులకు సూచనలిస్తున్న మురళీకృష్ణ

వెదురుకుప్పం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలంలోని ఆర్కేవీబీ పేట గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయ అధికారి జె.మురళీకృష్ణ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఏవో హేమలత, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం



నగరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): టీఆర్‌కండ్రిగ వద్ద ఉన్న సిరీడ్స్ బధిర పాఠశాల విద్యార్థులకు టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ తన మనవరాలు హరిణి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం అన్నదానం చేశారు. నాగరాజకుప్పం మాజీ సర్పంచి సెల్వమణి, అలెక్స్ రాజా తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఐరాల విద్యార్థులు



ఐరాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అనంతపురం ఎస్కేయూలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కోమల తెలిపారు. ఎంపికైన వారిలో ప్రకాష్, భవిత ఉన్నారు. విద్యార్థులను, పీడీ దేవాను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జనార్దనయాదవ్ అభినందించారు.

మొక్కు చెల్లించిన తెలుగు తమ్ముళ్లు

బంగారుపాళ్యం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సీఎంగా చంద్రబాబు, పూతలపట్టు ఎమ్మెల్యేగా మురళీమోహన్ గెలవాలని రాగిమానిపెంటకు చెందిన తెలుగు తమ్ముళ్లు బాలకృష్ణమ నాయుడు, నాగరాజు నాయుడులు తమిళనాడు - ఆంధ్ర బోర్డర్‌లోని కామసేనమిట్ట వద్ద ఉన్న కొండమ్మతల్లికి మొక్కుకున్నారు. తమ కోరిక నెరవేరడంతో మంగళవారం ఎమ్మెల్యేతోపాటు మండల అధ్యక్షుడు జయప్రకాష్, టీడీపీ నాయకులతో కలిసి వెళ్లి కొండమ్మతల్లికి మొక్కు చెల్లించారు.

గ్యాస్ ఏజెన్సీలో పరిశీలన

శ్రీరంగరాజుపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పుల్లూరు క్రాస్‌లో ఉన్న భారత్‌గ్యాస్ ఏజెన్సీని మంగళవారం తహసీల్దార్ లోకనాథ పిళ్లై పరిశీలించారు. సబ్సిడీ గ్యాస్ సిలిండర్‌కు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని చెప్పారు. ఏజెన్సీ యాజమాని ఝాన్సీ భాస్కర్‌నాయుడు, సిబ్బంది రమణ, రాజేంద్ర పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: టీడీపీ


టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్న ధరణీ ప్రసాద్ నాయుడు

బంగారుపాళ్యం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మురళీమోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు జయప్రకాష్ అన్నారు. మంగళవారం రాగిమానిపెంట, కీరమంద, కొదలమడుగు, బండ్లదొడ్డి గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ కార్యక్రమాన్ని చేపట్టారు. రాగిమానిపెంట దళితవాడలో జరిగిన కార్యక్రమంలో శాశ్వత సభ్యత్వాన్ని రూ.లక్ష చెల్లించి.. క్లస్టర్ ఇన్‌చార్జి ధరణీప్రసాద్ నాయుడు, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోకా ప్రకాష్ నాయుడు, ఎన్ఆర్ఐ విక్రమ్, వెంకటాపురానికి చెందిన మోహన్ నాయుడు, సాంబశివ నాయుడు, ఐరాలకు చెందిన శేఖర్ బాబు స్వీకరించారు. జనార్దన్ గౌడ్, లోకనాథం నాయుడు, బాలకృష్ణమ నాయుడు, నాగరాజు నాయుడు, చిన్నయ్య, నాగరాజ్ గౌడ్, మునిరత్నం, హరిప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్వోకు ఘనంగా వీడ్కోలు


పుల్లయ్యను సన్మానిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమయంలో జిల్లాకు వచ్చిన డీఆర్వో పుల్లయ్య సేవలు మరువలేనివని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బదిలీపై వెళ్తున్న ఆయన్ను మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా రెవెన్యూ అసోసియేషన్, కలెక్టరేట్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతన డీఆర్వో మోహన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో కులశేఖర్, రెవెన్యూ అసోసియేషన్ కలెక్టర్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు పార్థసారధి, హేమాద్రిరాజు తదితరులు ప్రసంగించారు.

విద్యార్థులకు అభినందన



వెదురుకుప్పం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి, ప్రశంసా పత్రాలను పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులురెడ్డి తెలిపారు. బీకాం చదువుతున్న విద్యార్థులు మేఘనాథ్, ఢిల్లీ ప్రసాద్, పూర్ణిమ, హేమలు ఆర్బీఐ 90 వసంతాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో సత్తా చాటారన్నారు. వీరిని మంగళవారం కళాశాలలో అధ్యాపకులు డాక్టర్ సీ.ఎన్.లత, కార్తీక్, ద్వార్ బాబు, భార్గవి, మీనా అభినందించారు.


అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేశ్‌తో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

గ్రామసభకు క్యూ కట్టిన బాధితులు


అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ అరుణకుమారి

పాలసముద్రం, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): పాలసముద్రం సచివాలయ ఆవరణలో మంగళవారం జరిగిన రీ సర్వే గ్రామ సభకు బాధిత రైతులు క్యూ కట్టారు. తహసీల్దార్ అరుణకుమారికి 140 మంది అర్జీలను సమర్పించారు. పాసుబుక్కులో ఉన్న భూముల విస్తీర్ణం, సర్వే నెంబర్లలో తేడాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేయర్ గణేష్, హరి, వీఆర్వోలు తంగరాజ్, శీను, రమణయ్య, రమేష్‌నాయుడు, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

టపాకాయల దుకాణం ప్రారంభం



గుడిపాల, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలో టపాకాయల దుకాణాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు మంగళవారం ప్రారంభించారు. బాలాజీ టపాసుల అంగడి యజమాని ప్రతాప్‌ను ప్రజలకు తక్కువ ధరలకే ఇవ్వాలని సూచించారు. టీడీపీ నాయకులు సాంబశివనాయుడు, రమేష్, గురునాథం, ఆనంద్ యాదవ్, మధుసూధన్ నాయుడు, శంకర్‌నాయుడు, బాబు, విల్సన్, రాజ తదితరులు పాల్గొన్నారు.